# సీతయ్య చెల్క

ఇంకో నెల రోజులయితే జొన్న చేను కోతకు వస్తుంది! - అని చాలా ఉత్సాహంగా వున్నాడు సీతయ్య. ఎండల్లో దుక్కి దున్నినంక తన భార్య తట్టలతో మోసి మోసి కూడబెట్టిన పెండ ఎరువును చెల్కలో చల్లాడు. నాలుగెకరాల చెల్కను మంచిగ పొతం చేసి రోహిణి కార్తెలోనే జొన్న విత్తనాలు వేసాడు. రోహిణిలో విత్తనం భూమిల పడితే బలం అంటరు. పంట బాగ పండుతుందంటరు. అదనుకు రోహిణి మొదట్లనె రెండు వానలు పడ్డయి. భూమిల వున్న కాకంత పోయినంక మళ్ళీ చెల్కను దున్ని సీతయ్య విత్తనాలు వేసాడు.

అందరి లాగా ఈసారి పత్తి అనీ మిర్చి వాటి జోలికి పోలేదు సీతయ్య. వరుసగా రెండేండ్లు పత్తి వేసి కాసులు పండుతయని ఆశకు పోయి అప్పుల పాలయ్యాడు. ఒక యేడు పత్తి సరిగ్గ రాలేదు. మొదట్లనేమో పత్తి విత్తనాలు పాడుగాను! సక్కంగ మొలవనే మొలవలేదు. మళ్ళీ దున్ని పత్తి విత్తనాలే వేసాడు. ఈసారి విత్తనాలు మొలిచాయి. పూత బాగనే వచ్చింది. కాయ నిలబడ్డది. కాని తెల్లగ మల్లె పూల లెక్క పత్తి బయటపడేటాళ్ళకు అతి వర్షాలు! దాంతో పత్తంతా చేతికి రాకుంట ఖరాబయింది. మళ్ళ గేడు పత్తి యేస్తే మంచిగనే వచ్చింది. కాని చేతికంది పత్తి యేరెటాళ్ళకు బజార్ల ధర లేదు. ధర పలికిందాక నిలువ వుంచుదామంటె పూరింట్ల జాగ లేదు. అమ్మితే పెట్టిన పెట్టుబడి సగం దాక నన్న ఎల్లలేదు. అప్పులోళ్ళ బాధలు పడలేక భార్య మీది పుస్తెల గొలుసు కాళ్ళకున్న సాలని కడాలు అమ్మి అప్పుదీర్చి సీతయ్య ఊపిరి తీసుకున్నాడు.

ఈ యేడు బుద్ధి వచ్చి పత్తి జోలికి పోలేదు. కడుపుకు ఎల్లితే చాలని పజ్జొన్నలు చెల్కల అలికాడు. సీతయ్య జొన్న విత్తనాలు మంచిగనే మొలిచినయి. చేను ఏపుగా పెరిగింది. వేసిన పెండ ఎరువు వుదార్థం కాలేదు. జొన్న కర్రలు బలంగా నిలబడ్డయి. దొడ్డు దొడ్డుగా జానెడు పొడుగు కంకులు పెట్టినయి. గింజలు పుష్టిగ వున్నయి. పాల గింజలు గట్టిపడ్తున్నయి. అనుకున్న దానికన్నా పంట బాగ వస్తదని సీతయ్య ఉత్సాహంగా

వున్నాడు. పచ్చగా వున్న జొన్న చేను బంగారు రంగుల వున్న కంకులతో గాలి తోలినప్పుడల్లా సీతయ్య గుండె లెక్కనే నాట్యం చేస్తున్నది. జొన్న చేనును చూసుకొని సీతయ్య మొఖం సంతోషంతో వెలిగిపోతున్నది. సీతయ్య నవ్వు మొఖంతో అటు యిటు చూసాడు దూరంగా ఇద్దరు పోలీసు జవాన్లతో ఒకాయన వస్తూ కన్పించాడు.

"వాళ్ళెవలో ఏందో!" అనుకొని సీతయ్య గుండె దడదడలాడింది. ఖరీదైన ప్యాంటు అంగీలో వున్నతను సీతయ్యకు దగ్గరగా వచ్చాడు. సీతయ్య మొఖంలో మొఖం పెట్టి చిరునవ్వు నవ్వాడు.

"నీదేనా జొన్న చేను సీతయ్యా!" అడిగాడాయన.

"నాపేరు సుత ఎరికే గీయనకు!" సీతయ్య మొఖం అనుమానంతో పాలిపోయింది. నోటినుంచి మాటరాలేదు. తన చేనుకు ఏదో దిష్టి తగిలినట్లుగా అతని గుండె దడదడమంది.

"జిల్లా కలెక్టరు సాబ్ అడ్గుతుంటె మాట్లాడవేందిరా" అన్నాడు పోలీసుల్లో ఒకడు.

"కలెక్టరు సాబా!... దండాలండీ!" ఏదోవిధంగా రెండు చేతులు దగ్గరికి తెచ్చాడు సీతయ్య.

"ఇదిగో సీతయ్యా! ముఖ్యమంత్రి వస్తున్నాడు మీ ఊరికి. ఈ ఊరిలో మీటింగు పెట్టాలనుకుంటున్నారు. ఊరికి దగ్గరగా నీ చెల్క జాగా మీటింగుకు బాగా వుంది. ముఖ్యమంత్రితో ఇంకా మంత్రులు వస్తారు నాలుగు ఊళ్ళ జనం వస్తారు. హెలికాప్టరు దిగాలంటె ఇదిగో ఇంత జాగా కావాలి. సీతయ్యా! నీ చెల్కను మీటింగుకోసం ఎంపిక చేసాం..." అని చెప్తున్నాడు కలెక్టరు.

"నా చెల్క మీటింగుకా?... మరి నా చేను! జొన్నలు... ఏడాదంతా తనకు తన పెండ్లాం పోరల కడుపులకు సరిపోతయనుకున్న జొన్నలు!... ఏమైతయి?..." సీతయ్యకేం తోచలేదు.

"సార్! నా పంట... చేతికొస్తున్న గింజలు?..." అని పైకి గులిగాడు.

"నీ పంటకేం ధోకా లేదు సీతయ్యా! నీ చేను చెడిపోయినా నీ పంటకు వచ్చే దబ్బు కన్నా ఎక్కువ డబ్బే నీకు పరిహారంగా ప్రభుత్వం ఇస్తుంది. ఏం భయం లేదు! బాధపడకు! ఆ డబ్బుతో ఏడాదంతా నువ్వు నీ కుటుంబం హాయిగా తింటూ కూర్చోవచ్చులే!" అన్నాడు కలెక్టరు. పోలీసుల వైపు తిరిగి ఆ చెల్కను ఎట్లా చదును చేయాలో వేదిక ఎక్కడ వుండాలో హెలికాప్టరు ఎక్కడ దిగుతుందో వివరంగా చెప్తూ ముందుకు వెళ్ళిపోయాడు.

అదంతా వింటుంటె సీతయ్య మెదడు పనిచేయలేదు. చెవులు వినపడలేదు. సీతయ్య అక్కడ్నే తలకాయ పట్టుకొని దొంతిగా కూలబడిపోయాడు. అతని తల పగిలి వెయ్యి వక్కలవుతున్నట్లుగ వుంది. కలెక్టరు పోలీసులు చేనునంతా తొక్కి తిరుగుతున్నారు. తన పెద్ద పోరడు నాలుగు కంకులు తెంపుకొని కాల్చుకొని తింటానంటె కసిరాడు సీతయ్య. ఇప్పుడు వీళ్ళు జొన్న కర్రలను, కంకులను తెగ తొక్కుకుంట తిరుగుతున్నారు! సీతయ్య గుండె ఉడికిపోయింది. ఏడుద్దామంటె ఏడ్పుకూడా వస్తలేదు. కండ్లు ఎండిపోయి మండిపోతున్నయి.

తెల్లవారి సీతయ్య చెల్క గుర్తుపట్టకుండ తయారయింది. పిల్లగాలులకు నాట్యం చేసే జొన్న చేను మాయమైంది. అక్కడంతా హడావిడిగా వుంది. తుపాకులతో పోలీసులు తిరుగుతున్నారు. అప్పుడే లారీలు ఒక్కొక్కటి జనాన్ని దింపుతున్నాయి. జనం కూర్చునేందుకు చెల్క ఎర్రని తివాచీ పరచినట్టుగా చదునయింది. ఊర్లో వున్న నాల్గు ట్రాక్టర్లను పట్టుకవచ్చి కాస్సేపట్ల నాలుగెకరాలు చేనునంతా పెకిలించి చదును చేసారు.

పదిహేను నెల రోజులయితే ఇంట్ల పడ్తయనుకున్న గింజలు నేలపాలయినయి! ట్రాక్టర్లు డ్రైవర్లు అంతా పుణ్యానికే. ఎవ్వరికీ ఒక్క పైస చెల్లించే దిక్కులేదు. చదును చేసిన చెల్కలో ఆడ మగ వేరు వేరుగా కూర్చునేటందుకు కట్టెలు పాతారు. కూర్చున్న జనానికి ఎదురుగా పెద్ద వేదిక తయారయింది. వేదికకు ముందల వంద గజాల వరకు ఖాళీ జాగా వదిలారు. సెక్యూరిటీ కోసం ఆ జాగల ఎవర్నీ కూర్చోనియ్యలేదు. వేదిక కింద ముందలి వైపుగా పత్రికల వాళ్ళు తమ కలాలను, టీవీ చానెళ్ళ, పత్రికల వాళ్ళ కెమెరామెన్‌లు తమ తమ కెమెరాలను అమరించుకుంటు సందడి చేస్తున్నారు. అప్పటికప్పుడు వేసిన కరెంటు తీగెల నుంచి కరెంటు వస్తున్నదా లేదా అని, అమర్చిన స్విచ్‌లు పనిచేస్తున్నయా లేదా అని కరెంటు పొల్లగాండ్లు పరీక్షల్లో మునిగిపోయి అటుయిటు తిరుగుతున్నరు. మీడియా వాళ్ళకు ఏం తిప్పల్లు లేవు కదా అని కార్యకర్తలు మాటిమాటికి వచ్చి “అన్న! అంత మంచిగున్నదానె?” అంట అరుసుకొని పోతున్నరు. వాళ్ళకు ఘడీఘడీకి చాయ్‌లందేటట్లుగ చూస్తున్నరు.

వేదిక మీద పొడుగాటి బల్ల ఒకటి వేసారు. దానిమీద అందమైన సిల్క్ గుడ్డను పరిచారు. ఆ బల్లమీద రెండు ఫ్లవర్ వాజుల్లో ప్లాస్టిక్ పూలను అమర్చారు. టేబిల్‌కు అటువైపు రెండు వరుసలుగా ప్లాస్టిక్ కుర్చీలు వేసారు. మధ్యలో మాత్రం ముఖ్యమంత్రి కూర్చునేటందుకు బంగారు రంగులో మెరుస్తున్న సింహాసనం లెక్క వున్న పెద్ద కుర్చీని వేసారు. మైకులను పరీక్షించే వాళ్ళు “హలో! హలో” అనే “ఒన్‌టూత్రీ” అనే లొల్లి సభంతా మారుమోగుతున్నది. ఇదంతా చూసి సీతయ్య ఇది తన నాలుగెకరాల చెల్కయేనా? అని విస్తుపోయాడు. చెల్క రూపమే మారిపోయింది. గుర్తుపట్టేటట్లుగ లేదు!

మైకులో కార్యకర్తలు “ఇంకొంచెం సేపట్లో రాష్ట్ర ముఖ్యమంత్రి, కేంద్ర మంత్రులు రాబోతున్నర”ని గట్టిగా వినేవాళ్ళ చెవులు పగిలిపోయేటట్లుగా ప్రకటిస్తున్నరు. ఆ ప్రాంతం నుంచి ఎన్నికయిన ఎమ్ఎల్‌ఏ రాష్ట్ర సాంస్కృతిక మంత్రి అయ్యాడు. ఆయన ఎలక్షన్నప్పుడు ఓట్లు అడిగేటందుకు వచ్చాడంతే మళ్ళీ కన్పించలేదు. ఇదిగో ఈరోజు వస్తున్నడు! రాతిపాలెం చాల చిన్న ఊరు. మారు మూల గ్రామం. ఆ గ్రామం ఉత్తరం దిశనుంచి మహారణ్యం మొదలవుతుంది.

‘ప్రజ్వల’ వంటి కవి, రచయిత అక్కడ పుట్టటమే కుగ్రామానికి పేరు తెచ్చిపెట్టింది. ‘ప్రజ్వల’ తన రచనలతో సాహిత్యం దిశనే మార్చాడు. ఒక అధ్యయాన్ని సాహిత్య చరిత్రలో సృష్టించాడు. తన పేర ఒక యుగాన్నే ఆరంభించాడు. అతని రచనలు భాష స్థితి గతినే మార్చేసాయి. అట్టడుగు వర్గం వాళ్ళు, పేదరైతుల వెట్టి చాకిరీని శోషణలను చిత్రించిన కవి, రచయిత ‘ప్రజ్వల’! మొదటిసారిగా దీనుల, ఆర్తుల పక్షంలో గొంతు

విప్పినవాడు! ప్రజ్వల తన భావజాలంతో సాహిత్యం సమాజాన్ని మార్చేస్తుందని ఓసారి నిరూపించాడు. అటువంటి మహాకవి మహారచయిత చనిపోయి యాభై సంవత్సరాలయింది. పుట్టి వంద సంవత్సరాలయింది. ఇన్నాళ్ళు అతడు సాహిత్య పాఠకుల హృదయాల్లోనే నివసించాడు. అభిమానుల ఆదరణతోనే జీవించాడు. కాని ఇప్పుడు ఆ కవి శతజయంతి ఉత్సవాలను జరుపాలని ప్రభుత్వం హఠాత్తుగా మేల్కొంది. అతడు జన్మించిన గ్రామంలోనే ఆ ఉత్సవాన్ని జరుపాలని నిర్ణయించింది. ఆ మహారచయితకు ఏదైనా స్మారక భవనం కట్టాలని తలపెట్టింది.

ఆ విధంగా మేల్కొని ఉలిక్కిపడటానికి వెనుక గొప్ప కారణం లేకపోలేదు! వచ్చే సంవత్సరం ఎన్నికలు వస్తున్నాయి. నాలుగు సంవత్సరాలుగా ప్రతిపక్షంలో వున్న పార్టీ మొదటిసారిగా ఎలక్షన్లో గెలిచింది. రాబోతున్న ఎన్నికల్లో గెలుపును తిరిగి సాధించాలంటె ఏవో పనులు, పథకాలు చెయాలె! దానిలో భాగంగానే ఈ సభ ఏర్పాటయింది. 'ప్రజ్వల'ను స్మరించటమంటె పై వర్గమేకాదు అట్టడుగు వర్గం ఓట్లను సాధించటమన్న మాటే!

రాజు తలచుకుంటె దేనికైనా కొదువ వుంటుందా? వెంటనే ఆ గ్రామం వున్న జిల్లా కలెక్టరుకు ఆర్డర్లు పోయాయి. ఆయన ప్రభుత్వ యంత్రాంగాన్నంతా కదిలించాడు. పార్టీ కార్యకర్తలు ఆ సభను గొప్పగా చేయాలని నడుంకట్టారు. ఇటువంటి మారుమూల గ్రామానికి ముఖ్యమంత్రి వస్తున్నడంటే మాటలా! సామాన్యంగా ఆ ప్రాంతం పార్టీ కార్యకర్తలకు అటువంటి అవకాశం దొరకనే దొరకదు. ఇక ఇప్పుడు దొరికింది కాబట్టి తమ సత్తా ఏమిటో వాళ్ళు చూపించదలచుకున్నరు. ఆనాటి సభకు ముమ్మరంగా సాగుతున్న కోతల పనులను వదులుకొని చుట్టుపక్కల పది ఊర్ల నుంచి రైతుజనం వచ్చారంటె దానిలో కార్యకర్తల శ్రమ, నిధుల సేకరణ ఎంత వుందో ఊహించాల్సిందే తప్ప చెప్పలేము. లారీ యజమానుల దగ్గర్నుంచి చిన్న చిన్న చాయ్ హోటల్ వాళ్ళ వరకూ ఆ రోజు నడుం కట్టారు. ఎవరెవరికి ఏంతెంత లాభాలు లభించాయో చెప్పలేము. కాని వాళ్ళందరి సహకారంతో ఆ ప్రాంతంలో ఎప్పుడూ జరగనంత మహాసభ జరుగుతున్నది.

అసలు ప్రతి సంవత్సరం 'ప్రజ్వల' పుట్టినరోజున రాష్ట్ర నలుమూలల నుంచి ఆఖరికి రాష్ట్రేతర ప్రాంతాలనుంచీ కూడా ఆ కవి అభిమానులు సాహిత్య నాటక సంస్థల వాళ్ళు ఆ కుగ్రామంలో చేరటం ఆ కవి వ్రాసిన పాటలు కవిత్వం గానం చేయటం నాటకాలు వేయటం జరుగుతూనే వుంది. ఇన్నాళ్ళు దీన్ని గురించి ఏ పత్రికలూ టీవీలు వ్రాయలేదు. పట్టించుకోలేదు. కాని ఇప్పుడు ప్రభుత్వం పూనుకున్న సభను గురించి పత్రికలు అప్పుడే ఈ వార్తను కొండంతలుగా చేసి వ్రాసాయి. ఇక సభ అయిం తర్వాత ఏమేం వ్రాస్తారో తెలియదు! ముఖ్యమంత్రి రాష్ట్ర, కేంద్ర మంత్రులు వచ్చి ఆ కుగ్రామం మీద ఏం వరాలు కురిపిస్తారో చూడాలి!

సభకు వచ్చిన జనం అసహనంగా వుంది. వాళ్ళంతా పొద్దున ఇంత బువ్వ తిని వచ్చారు. హోటళ్ళలో తినిపిస్తమని తలా యాభై రూపాయలిస్తమని ఆశలు చూపించి కార్యకర్తలు జనాన్ని అక్కడికి చేరవేసారు. నాలుగ్గంటలకు మొదలవుతుందన్న సభ అరయినా మొదలయ్యే జాడలు కన్పించటంలేదు. కడుపులో ఆకలి దంచేస్తున్నది. అప్పుడప్పుడు

కార్యకర్తలు కన్పించి మంచి నీళ్ళను మాత్రం అందిస్తున్నారు. ప్లాస్టిక్ కప్పుల్లో చాయ్‌లిస్తున్నారు. ఇంతవరకు ఒక్కపైసా చేతిలో పడలేదు. చుట్టూ తినుబండారాలమ్మే వాళ్ళున్నారు. కాని చాలామంది దగ్గర కొనుక్కొని తిందామంటె పైసల్లేవు. జనం కార్యకర్తలమీదికి లేచారు. అప్పుడు ప్లాస్టిక్ బ్యాగుల్లో పులిహోర అన్నాన్ని పంచారు. పెద్దలు, పిల్లలూ ఎగబడి ఎగబడి అందినన్ని ప్యాకెట్లను సంపాదించుకొని తిన్నారు. మైకుల్లో పాటలు జోరుగా సాగుతున్నయి. చెవులు చిల్లులు పడేటట్లుగా సినిమా పాటలు! "నువ్వొస్తానంటే నేనొద్దంటానా"... "నాకు నువ్వు నువ్వు నాకూ..." సినిమా పాటలు దిక్కులు దద్దరిల్లేటట్లుగా విన్పిస్తున్నాయి.

ప్రతియేటా 'ప్రజ్వల' జయంతి ఉత్సవంలో ఆయన వ్రాసిన పాటలు పాడేవాళ్ళు. ఆయన వ్రాసిన నాటకాలు వేసేవాళ్ళు. ఇప్పుడా కళాకారులను, అభిమాన సంఘాల వాళ్ళనంతా అధికారులు వేదిక వెనుక కూర్చుండ బెట్టారు. ముఖ్యమంత్రి సభ అయివెళ్ళిపోయిం తర్వాత వాళ్ళ కార్యక్రమాలు చేసుకొమ్మని చెప్పారు. అప్పుడెవరుంటారు. అయ్యే ఆలస్యం చూస్తే అప్పుడు వాళ్ళ కార్యక్రమాలు జరుగుతాయన్న ఆశ కన్పించటంలేదు. వాళ్ళకు తప్పకుండా నిరాశే ఎదురవుతుంది.

పొద్దుపోతున్నకొద్దీ జనంలో అసహనం పెరిగిపోతున్నది. ఫ్లడ్ లైట్ల వెలుగు పట్టపగలును సృష్టిస్తున్నది. ముఖ్యమంత్రి తమ మీద ఏం వరాల జల్లులు కురిపిస్తాడో అని పెద్దలు ఓపికను తెచ్చిపెట్టుకుంటున్నరు. పిల్లలు యువకులు సినిమా పాటలతో గొంతు కలపటం మొదలుపెట్టారు. కొందరు లేచి పాటకు లయకు తగ్గట్లుగా సినిమా హీరోలను అనుకరిస్తూ గెంతటం ఆరంభించారు. ఇంతలో ఎవరో మైకులో ముఖ్యమంత్రి గారు కొంచెం సేపట్లో వస్తున్నారని ప్రకటించారు. జనంలోని అసహనం కొంత శాంతించింది.

ఆఖరికి హెలికాప్టరు మోత వినిపించింది. దుమ్ము లేపుకుంటూ హెలికాప్టరు పెద్ద సుడిగాలి లెక్క వచ్చి కూర్చున్న జనానికి కనుచూపు మేరలో ఆగింది. గద్దలాగ వచ్చి భూమ్మీదకి దిగిన హెలికాప్టరును చూడటానికి జనం లేచారు. అంతటా కలకలం పుట్టింది. కాని కార్యకర్తలు, లాఠీలతో పోలీసులు జనాన్ని లేవకుండా కదలకుండా అదుపుచేసారు.

హెలికాప్టరులోనుంచి ముఖ్యమంత్రి నలగని తెల్లని ఖద్దరు పంచె అంగీలో ముందుగా దిగాడు. జనంవైపు చూసి రెండు చేతులు పైకెత్తి గాలిలో జోడించాడు. వెంటనే కుడిచేతి రెండు వేళ్ళను ఇంగ్లీషు 'వీ' అక్షరం ఆకారంలో ముద్రగా పెట్టాడు. జనానికి ఆ అక్షరం గురించి తెలవకున్నా ఆ ముద్ర విజయానికి గుర్తు అనీ తమను విజయంవైపు జనం నడపాలని అభ్యర్థించటమనీ తెలుసు.

ముఖ్యమంత్రి వెనుక మంత్రులు దిగారు. వాళ్ళంతా దిగారో లేదో బిలబిలమంటూ కుప్పతెప్పలుగా చోటా మోటా నాయకులు వాళ్ళ చుట్టూ చేరారు. పూలదండలు వేసారు. పుష్పగుచ్ఛాలు చేతికందించారు. అంతమంది అన్ని నాయకబృందాలు ఇంతసేపు ఎక్కడ దాగి వున్నరో తెలియదు! హెలికాప్టరు నుంచి వేదిక వరకు ఆ కొంచెం దూరం కోసం ఓ

అరడజను కార్లు దూసుకొని వచ్చాయి. ముఖ్యమంత్రి మంత్రులు ఆ కార్లలోకి ఎక్కారు. కార్లు కదిలాయి. వాటి వెంట సెక్యూరిటీ బలాలు పరిగెత్తాయి. కార్లకు అటు పక్క ఇటు పక్క వెనుకా ముందల పరిగెత్తే వాళ్ళను చూస్తుంటె పూర్వం భూస్వాముల కచ్చురం బండ్ల వెంట పరిగెత్తే వెట్టిచాకిరి వాళ్ళు గుర్తుకు రాక మానరు! మనుషులు మారారు. కాని వ్యవస్థ అదే! మారలేదు!

అరడజను కార్లు వచ్చి వేదిక పక్కన ఆగాయి. ముఖ్యమంత్రి మంత్రులు కార్లనుంచి దిగారు. అప్పటికే మైకులో ముఖ్యమంత్రికి మంత్రులకు స్వాగత వచనాలు పలుకుతున్నారు. ఎక్కువ ఆలస్యం కాకుండా ముఖ్యమంత్రి మంత్రులు ప్రాంతీయ నాయకులు వేదిక మీదికి పోయి కార్యకర్తలు చూపిస్తుండగా తమ తమ ఆసనాల్లో కూర్చున్నారు. సభ మొదలైంది. ఒక్కొక్కరి ఉపన్యాసాలు జోరుగా సాగుతున్నాయి. ముందుగా ఆ నియోజకవర్గం ఎమ్ఎల్ఏ, రాష్ట్ర సాంస్కృతిక మంత్రి మాట్లాడాడు. 'ప్రజ్వల' ఆ ప్రాంతానికి ఎంత గౌరవం తెచ్చాడో చెప్పాడు. 'ప్రజ్వల' ఎంత గొప్ప రచయితో పొగిడాడు. అంతటి రచయితలు చాల అరుదుగా పుడ్తారు అన్నాడు. ఆయన రచనలు ప్రపంచంలోని ఎన్నో భాషల్లోకి అనువదించబడినాయంటె ఆయన రచనల విలువ ఎంతటిదో తెలుస్తుందన్నాడు. అంత గొప్ప రచయిత ఈ గ్రామంలో పుట్టటం మనందరి అదృష్టం అని పొగిడాడు.

తర్వాత ముఖ్యమంత్రి మైకు అందుకున్నాడు – "ప్రజ్వల మహామనీషి" ఆయన విలువను అందరూ ఇంతకాలం గుర్తించలేదు" – అని జనం వైపు కలయజూసాడు ముఖ్యమంత్రి. మళ్ళీ గొంతెత్తాడు – "మీరందరూ అతన్ని మరచిపోతున్నారు!" అంతటా నిశ్శబ్దం ఆవరించింది. అందరూ చాల శ్రద్ధగా వింటున్నారు. – "ప్రజ్వల'ను మీకు గుర్తు చేయటానికే మేం ఇక్కడికి వచ్చాం. ఈ గ్రామంలో ఇదిగో ఇక్కడ!.. ఇక్కడే! 'ప్రజ్వల'కు స్మారక భవనం నిర్మించదలచుకున్నాం!" అంటూ ముఖ్యమంత్రి జనం కూర్చున్నవైపు కుడిచేతిని చాపి చూపిస్తూ అన్నాడు.

అది వింటున్న ముఖ్యమంత్రి చేతిని చూస్తున్న సీతయ్య గుండెలో రాయి పడినట్లయింది. ఒళ్ళంతా చల్ల చెమటలు పుట్టాయి. ఎడ్డిగా చుట్టూ చూసాడు. అందరూ శ్రద్ధగా వింటున్నరు. "కాని ఇది నా నాలుగెకరాల చెల్క తండ్రి తాతల నుంచి వచ్చిన చెల్క తనకున్నది అదొక్కటే ఆస్తి! అదేందో గిక్కడ కడ్తే నా ఎవసం ఎట్ల నడుస్తది! నా పెండ్లాం పిల్లలేం తిని బతుకుతరు!" అని లోలోపల సీతయ్యకు చింత పుట్టింది. ముఖ్యమంత్రి ఉపన్యాసం సాగుతున్నది–

'ప్రజ్వల' ప్రజలకోసం... సామాన్య జనం కోసం... మీకోసం రచనలు చేసాడు. అందుకే ఆ ప్రజల కవికి రచయితకు ప్రపంచంలో ఎక్కడా ఎవరికీ లేనంత గొప్పగా భవ్యమైన స్మారక భవనం మా ప్రభుత్వం కట్టాలని తలపెట్టింది. ఇన్నాళ్ళు గద్దె మీదున్న ప్రభుత్వం ఎన్నడైన ప్రజల గురించి పట్టించుకుందా? – లేదు. ప్రజల కవి, రచయిత ప్రజల కోసం జ్వలించిన 'ప్రజ్వల'కు ఏమైన చేసిందా? ఏం చేయలేదు. ప్రజలంటే ఆ ప్రభుత్వానికి పట్టలేదు. ప్రజాసంక్షేమం పనులేం చేయలేదు. మేం 'ప్రజ్వల' కీర్తి కలకాలం నిలిచేటట్లుగా ఇక్కడ ఓ స్మారక భవనం నిర్మించదలిచాం. ఇన్నాళ్ళు అధికారంలో వున్న

పార్టీ ఏం చేసింది? ఏం చేయలేదు. అది మీకు తెలుసు! ఓటు అధికారం చేతిలో వున్న మీరు మళ్ళీ వాళ్ళకు బుద్ధి చెప్తారు. ప్రజా వ్యతిరేకులైన ఆ పార్టీ నాయకులను ఓడించి మీరు అభివృద్ధిపథంలో వున్నారని నిరూపిస్తారు! ఆ పార్టీ ఎప్పుడైనా 'ప్రజ్వల'ను పట్టించుకకుండా? మేం డబ్బుకు వెనుక ముందాడం! మూడు నెలల్లో దివ్యమైన భవనాన్ని నిర్మించి చూపిస్తాం! - జైజనహిత పార్టీ! జైహింద్!" అని ముఖ్యమంత్రి రెండు చేతులు పైకెత్తి జోడించి నమస్కరించాడు. ముందు కూర్చున్న జనం సంతోషంతో చప్పట్లు చరిచారు. తర్వాత కేంద్ర సాంస్కృతిక పర్యాటక మంత్రి లేచాడు.

"ప్రజలారా! మీరు వెర్రివాళ్ళు కాదు. ఏ ప్రభుత్వం పనిచేస్తుందో మీకు తెలుసు. ఈ గ్రామం 'ప్రజ్వల' పుట్టిన పుణ్యభూమి! మీకు తెలుసు! మీ గ్రామాన్ని ప్రపంచపటంలో అందరూ గుర్తించేట్లుగా చేస్తాం. ఓ గొప్ప పర్యాటక కేంద్రంగా మారుస్తాం! ఇది మేం మీకిచ్చే వాగ్దానం. స్మారక భవనానికి కేంద్ర ప్రభుత్వమూ నిధులు ఇస్తుంది. ఇంతకుముందు మీ రాష్ట్రంలోని ప్రభుత్వం కేంద్రం నుంచి నిధులను తీసుకొని ఏ పనులూ చేయలేదు. ఇప్పుడట్లా కాదు. ఈ స్మారక భవనం మూడు నెలల్లో పూర్తవుతుంది! ఇదిగో మీకిచ్చిన మాట నెరవేరుస్తామని మరోసారి వాగ్దానం చేస్తున్నాను! అదే విధంగా మీరూ మీ వాగ్దానాలు మరచిపోకూడదు. మా పార్టీ చేసిన జనహిత పథకాలను ఇంతకుపూర్వం అధికార పీఠం మీద కూర్చున్న పార్టీ చేపట్టలేదు! అది మీరందరూ గుర్తుంచుకోవాలని మనవి చేస్తున్నాను..." అని రెండు చేతులెత్తి నమస్కరించి మంత్రి కూర్చున్నాడు. ఆయన ముఖ్యమంత్రి తమ్ముడే. కేంద్రంలో మంత్రి పదవిలో వున్నాడు.

తర్వాత రాష్ట్ర సాంస్కృతిక పర్యాటక మంత్రి లేచాడు - "ముఖ్యమంత్రిగారు చెప్పినట్లుగా ఇదిగో ఇక్కడే ఈ స్థలంలో ప్రజ్వలకు ఓ గొప్ప స్మారక భవనాన్ని నిర్మిస్తాం. ప్రపంచంలోనే మీ గ్రామం ఓ ప్రసిద్ధమైన పర్యాటక స్థలంగా మారిపోతుంది. దేశవిదేశాల పర్యాటకులతో మీ గ్రామ స్వరూపమే మారిపోతుంది! దాంతో ఆర్థికంగా మీరెంతో లాభపడ్తారు!..." అని ముగించాడు ముక్తసరిగా.

ఆ తర్వాత కేంద్ర విద్యామంత్రి బారి వచ్చింది. ఆయన కొంచెం చదువుకున్నవాడే. ఉట్టిగనే విద్యామంత్రి కాలేదు. ఆయన 'ప్రజ్వల' రచనలు చదివాడు. యువకుడుగా ఉన్నప్పుడు ఆ రచనలచేత ప్రభావితుడయ్యాడు కూడా. అందుకే చాల ఉత్సాహంగా ఉపన్యాసం మొదలుపెట్టాడు - "ఈరోజు మీ అందరి ముందు ఏం మాట్లాడాలో నా గొంతు పెకలటం లేదు. మీరు మీ గ్రామంలో పుట్టి చాల పుణ్యం చేసుకున్నారు! అదృష్టవంతులు! 'ప్రజ్వల' వంటి వ్యక్తికి ఈ గ్రామం జన్మనిచ్చింది. ఈ భూమి తరించింది! 'ప్రజ్వల' పేరు మీద కేంద్ర ప్రభుత్వం తరఫున ఇదిగో ఇక్కడే స్మారకభవనం, పక్కన ఒక అధ్యయన కేంద్రాన్ని నిర్మిస్తాం. అదొక గొప్ప పరిశోధక కేంద్రంగా అభివృద్ధి పరుస్తాం! ప్రపంచంలోని అన్ని దేశాలనుంచి విద్యార్థులు పండితులు ఇక్కడికి వచ్చి పరిశోధనలు చేస్తారు. ఈ గ్రామం మరో నలందా అవుతుంది! అత్యాధునికమైన గ్రంథాలయంకూడా వచ్చేటట్లుగా చేస్తాం. ప్రపంచంలో ఎక్కడాలేని గొప్ప గ్రంథాలయం ఇక్కడ అవతరిస్తుంది!..."

మంత్రులు 'ఇక్కడ' అంటూ చేయిచాచి చూపినప్పుడల్లా సీతయ్య గుండె దడదడలాడుతున్నది. నా బతుకు దెరువు ఏమౌతుందో అని భయపడ్తున్నడు. అదంతా వింటున్న జనం మాత్రం తమకేదో జరిగినట్లుగానే భావించి జోరుగా చప్పట్లు చరుస్తున్నరు.

సభ అయిపోయింది. మంత్రులు కార్లలో హెలికాప్టరు చేరుకున్నరు. వాళ్ళు హెలికాప్టరులోకి ఎక్కగానే పెద్ద గాలి దుమారాన్ని లేపుతూ అది పైకి ఎగిరింది. హెలికాప్టరును వింతగా చూస్తున్నరు జనమంతా ఆగిపోయి. హెలికాప్టరు లేపిన దుమ్మంతా వాళ్ళ ముఖాల మీద అలుముకుంది! హెలికాప్టరు కాస్సేపట్లో మాయమైంది. అప్పుడు జనాన్ని కదలనిచ్చారు పోలీసులు. జనం ఎవరి లారీలను వాళ్ళు వెతుక్కుంటూ కదిలారు.

సీతయ్య చెల్క ఖాళీ అయింది. సీతయ్య ఒక్కడే మిగిలాడు అక్కడ. చుట్టూ కలియజూసాడు. జొన్న చేను లేదక్కడ. రేపు అక్కడ ఓ భవనం వెలుస్తుంది. వున్న ఒక్క చెల్క పోతే తను బతికేదెట్ల? అతని కండ్ల పొంటి కన్నీళ్ళు ధారలు కట్టాయి. ఇంతలో వేదిక దగ్గర కరెంటు సామాన్లు, మైకులు సర్దుకుంటున్న వాళ్ళల్లోనుంచి ఒకను సీతయ్య దగ్గరికి వచ్చాడు. అతడు ఖరీదైన సూటు బూటులో వున్నాడు.

"సీతయ్య అంటె నువ్వేనా?–" అడిగాడు దగ్గరగా నిలబడి. సీతయ్య కన్నీటి ధారలతో తడిసిన మొఖాన్ని పైకెత్తాడు.

"అవునయ్య!–" సీతయ్య గొంతు కష్టంగా పెకిలింది.

"ఇదిగో ఈ కాగితం తీసుకొని కలెక్టరాఫీసుకు రేపు రా నీకు రావలసిన నష్టపరిహారాన్ని చెల్లిస్తాం" కాగితాన్ని సీతయ్య చేతిలో పెట్టి చీకట్లో మాయమయ్యాడు.

తెల్లవారి సీతయ్య రెండొందల రూపాయలు కష్టంగా అప్పు సంపాదించి అంగి కొసల పెట్టుకొని పట్నం బయలుదేరాడు. కలెక్టరాఫీసు గేటు దగ్గర జవాను చేతిలో పదిరూపాయలు పెట్టింతర్వాతనే కలెక్టరు పి.ఏ. దర్శనమైంది. పి.ఏ ఆలస్యం చేయకుండా సీతయ్యను కలెక్టరు అర్రలోకి తీసుకపోయి సీతయ్య తెచ్చిన కాగితాన్ని అతని చేతికందించి పరిచయం చేసాడు. కలెక్టరు కాగితం చదివి "ఐనో!... ఐనో!..." అని తలూపాడు.

"సీతయ్య పేర తయారు చేసిన చెక్కును తీసుకరండి" అని కలెక్టరు పి.ఏ కు చెప్పాడు. పి.ఏ. చెక్కును తేవటానికి బయటికి కదిలాడు.

"సీత...య్యగా...రూ! మీరు అతని వెంట పోయి చెక్కు తీసుకోండి" అన్నాడు కలెక్టరు. సీతయ్య అక్కడ నిలబడటం ఇష్టం లేదన్నట్లుగా మొఖం పెట్టి.

సీతయ్య ఉరుక్కుంట పోయి పి.ఏ. ను పట్టుకున్నాడు. పి.ఏ. సీతయ్యను తన టేబిల్ దగ్గరికి తీసుకపోయి ఓ పది కాగితాల మీద ఇరవైచోట్ల వేలిముద్రలు వేయించుకొని చెక్కును సీతయ్య చేతిలో పెట్టాడు. సీతయ్య తెల్లబోయి ఆ చిన్న కాగితంవైపు చూసాడు. అది మీకు రావలసిన వెయ్యి నూట పదహారు రూపాయల చెక్కు దీన్ని బ్యాంకుకు పోయి డబ్బు తీసుకోవాలి" అని బ్యాంకుకుపోయి డబ్బు ఎట్లా తీసుకోవాలో వివరించి చెప్పాడు.

అదంత సీతయ్యకేమీ అర్థం కాలేదు. అయినా తనకు తన చేనుకు నష్టంగా వచ్చేది వెయ్యినూటపదహార్లేనా?

"నాకు వచ్చే పైసలు ఇంతేనా? –" పి.ఏ. వైపు పాలిపోయిన మొఖంతో చూసాడు సీతయ్య. ఇంకొక దిక్కు నగదు చేతిలో పడ్డదనుకుంటె ఈ చెక్కు వ్యవహారం! అంతా సీతయ్యకు అయోమయంగా వుంది! "నీ పంటకు వచ్చే నష్టపరిహారమంతే! –" అన్నాడు పి.ఏ.

"సంవత్సరమంతా నేనూ నా పిల్లలు, పెండ్లాం తినే జొన్నలు! అంత పంటకు గింతేనా? గీ పైసలు మా తిండికి ఎన్ని రోజులైతయి! అది పోంగ గీ కాగితం నా చేతిల పెట్టింర్రు! –" సీతయ్య గొంతు తడారిపోయి నోటివెంట మాట సరిగ్గా రావటంలేదు. దుఃఖంతో ఆగిపోయాడు.

"నీ జొన్న పంటకు అంతకంటె ఎక్కువ నష్టపరిహారం రాదయ్యా. లెక్కకట్టే ఇచ్చాం. ఇదిగో ఇంకో విషయం నీ భూమిలో నువ్వు ఇకముందు నాగలి పెట్టి దున్నవద్దు. ఆ భూమిలో వ్యవసాయం చేయవద్దు. ఆ భూమిని ప్రభుత్వం స్మారక భవనం కోసం తీసుకుంది. ఇప్పుడా భూమి ప్రభుత్వంది. ఆఁ... అయితే ఆ భూమికి నీకు రావలసిన ఖరీదును నీకు ప్రభుత్వం తొందర్లోనే మంజూరు చేస్తుంది! తెలిసిందా! జాగ్రత్త!" అని పి.ఏ. అక్కడ్నుంచి గబగబ వెళ్ళిపోయాడు.

సీతయ్యకు చలిజ్వరం వచ్చినట్లుగా ఒళ్ళంతా వణికిపోయింది. అతని గుండెలో దుఃఖం నిండిపోయింది. ఛాతి పగిలిపోతుంగా ఏంది అనిపించింది. నిశ్శబ్దంగా అక్కడ్నుంచి కదిలాడు.

తర్వాత ఎలక్షన్లో ఆ పార్టీనే అధికారంలోకి వచ్చింది. కాని అక్కడ స్మారక భవనాన్ని మాత్రం కట్టలేదు. ఏండ్లు గడిచిపోతున్నాయి. పార్టీలు ప్రభుత్వాలు మారిపోతున్నయి. కాని 'ప్రజ్వల' కు స్మారక భవనాన్ని ఎవరూ కట్టలేదు. సీతయ్యను మాత్రం అధికారులు ఆ చెల్కను దున్ననియ్యలేదు. అది ప్రభుత్వం తీసుకున్న భూమి అని బోర్డు పెట్టారు.

*"అరుణతార" మే, 2006*